ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 15 నవంబరు 2025



మూడు చక్రాల వాహనాలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు మూడు చక్రాల వాహనాల కోసం ఈ నెల 25లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి జిల్లా దివ్యాంగుల సంక్షేమాధికారి బి.శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వందశాతం సబ్సిడీతో జిల్లాకు 40 వాహనాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 70 శాతం వైకల్యం కలిగిన 18నుంచి45 సంవత్సరాల లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వార్షికాదాయం రూ.3 లక్షలు మించరాదన్నారు. డిగ్రీ విద్యార్థులు , టెన్త్ పాసై స్వయం ఉపాధి పొందుతున్న వారు తగిన ధ్రువపత్రాలు అందించాలని సూచించారు.

మన్యంలో చలిపులి

- పెరిగిన చలి తీవ్రత
- 17 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఏజెన్సీపై మంచు దుప్పటి
- వణికిపోతున్న ప్రజలు
- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

పాలకొండ/సాలూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చలి తీవ్రత బాగా పెరిగింది. రోజు రోజుకూ రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. పొగ మంచు, చలి అధికంగా ఉండడంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ఇళ్ల నుంచి బయటికి రావడానికే ఆలోచిస్తున్నారు. పొగమంచు కారణంగా వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహన చోదకులు ఉదయం 8 గంటల వరకు లైట్ల వెలుగులోనే పయనించాల్సి వస్తుంది. దగ్గరకు వచ్చే వరకూ ఎదుటి వాహ నాలు కనిపించని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ నెలలోనే చలి ఇలా ఉంటే మున్ముందు ఇంకెలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. గత మూడు రోజులుగా 20 డిగ్రీల నుంచి 18 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి ఉదయం 8 గంటల వరకూ దట్టమైన పొగమంచు కమ్మేస్తోంది. ఏజెన్సీ మండలాల్లో 15 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో చలిని తట్టుకునేందుకు ప్రజలు ఉన్ని దుస్తులను ధరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంకీ క్యాప్‌లు, మఫ్లర్లు, శాలువాలు, స్వెట్టర్లు, ఆర్కిన్ తదితర వాటికి గిరాకీ పెరిగింది.

జాగ్రత్తగా ఉండాలి

చలికాలంలో గుండె వ్యాధిగ్రస్థులు జాగ్రత్తగా ఉండాలి. చలి ఎక్కువగా ఉంటే వాకింగ్ చేయవద్దు. అధిక బరువు, ఆస్తమా, గుండె వ్యాధులున్న వారు వాకింగ్ విషయంలో వైద్యుల సూచనలు పాటించాలి. స్మోకింగ్ మాని వేయాలి. ఆల్కాహాల్ తీసుకోకూడదు. ఊపిరితిత్తులు, కిడ్నీ బాధితులు కూడా అప్రమత్తంగా ఉండాలి. చల్లటి ప్రదేశంలో పడుకోవద్దు. పొగమంచు బారిన పడకుండా ఉండడానికి మాస్కులు ధరించాలి. గోరు వెచ్చటి నీటితో స్నానం చేయాలి. చలిగాలిలో వృద్ధులు, పిల్లలు బయట తిరగరాదు.

- బి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్, సీతంపేట ఏరియా ఆసుపత్రి

పూర్తి వివరాలు 6లో



చలికాచుకుంటున్న పాలకొండ వాసులు

రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలే!

- అంతకుమించి వెచ్చిస్తే.. ఇంక అంతే సంగతి
- 'ఉపాధి' నిబంధనలను మార్చిన కేంద్ర ప్రభుత్వం
- మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో జిల్లాలో చేపట్టిన పనులపై ఎఫెక్ట్
- బిల్లుల చెల్లింపునకు బ్రేక్
- తలలు పట్టుకుంటున్న కాంట్రాక్టర్లు
- జిల్లా యంత్రాంగంతో రాష్ట్ర ఉన్నతాధికారుల సమీక్ష
- ఈ పంచాయితీ ఢిల్లీకి చేరనున్నట్లు సమాచారం



బాగుజోల-చిలకమండంగి రహదారి నిర్మాణం పూర్తయినా కొత్త నిబంధనల ప్రకారం నిలిచిన బిల్లుల చెల్లింపు



బిల్లుల కోసం ఎదురుచూస్తున్న గండరపువలస-కరాసవలస రహదారి

పార్వతీపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మన్యంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన రోడ్డు నిర్మాణాలకు బిల్లుల చెల్లింపులు జరగడం లేదు. ఏడాదిగా ఇదే పరిస్థితి నెలకొంది. నిబంధనలు మారడమే ఇందుకు కారణం. కాగా కోట్లాది రుపాయల మేర బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని రహదారుల నిర్మాణాలు కూడా నిలిచిపోయాయి. వాస్తవంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి పథకం మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా మారుమూల పల్లెలు, కొండ శిఖర గ్రామాలకు పెద్దత్తున రహదారి నిర్మాణాలు చేపట్టారు. అయితే కేంద్ర ప్రభుత్వం నిబంధనలు మార్చేసింది. ఒక రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలే పరిమితం చేసింది. దీంతో మన్యంలో రూ.50లక్షలకు మించి పనులు చేపట్టిన రహదారి బిల్లు లకు బ్రేక్ పడింది. నిబంధనల మార్పుతో కాంట్రాక్టర్లు, అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అయితే ఈ పంచాయితీ ఢిల్లీకి చేరనున్నట్టు సమాచారం.

ఇదీ పరిస్థితి..

- ఉపాధి మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా రహదారి నిర్మాణాలు వేగవంతంగా చేపడితే బిల్లుల చెల్లింపులు జరుగుతాయని ఇంజనీరింగ్ అధికారులు చెబుతూ వచ్చారు. దీంతో కాంట్రాక్టర్లు కూడా ఎంతో ఉత్సాహంగా పనులు చేపట్టారు. అయితే సుమారు ఏడాదిగా బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడంతో వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. నిర్మాణాలు ఎలా పూర్తి చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పనుల్లో పురోగతి కనిపించకపోవడంతో వారు ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురవుతున్నారు.
- జిల్లాలో పంచాయతీరాజ్, గిరిజన ఇంజనీరింగ్ శాఖల ద్వారా ఉపాధి మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన పనులకు కోట్లాది రూపాయల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది. నాలుగు నియోజకవర్గాల పరిధిలో పంచాయతీ రాజ్‌శాఖ ద్వారా 71 రహదారులకు సుమారు రూ.31 కోట్లు, అదేవిధంగా గిరిజన ఇంజనీరింగ్ శాఖ ద్వారా సమారు రూ.పది కోట్ల పైబడి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎఫ్‌టీవో జనరేట్ అయినప్పటికీ చెల్లింపులు జరగకపోవడంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. మొత్తంగా నిబంధనలు మారితే గాని బిల్లులకు క్లియరెన్స్ వచ్చేలా లేదు. అయితే కొత్త నిబంధనల మేరకు రూ.50 లక్షల లోపు చేపట్టిన రోడ్డు నిర్మాణాలకు బిల్లులు మంజూరవుతున్నాయి.

నిబంధనలు ఇలా..

ఉపాధి హామీ పథకంలో నిర్మించే బీటీ రహదారులకు సంబంధించి ఎన్ని కోట్లు అయినా ఒకే రహదారిపై ఖర్చు

(మిగతా 8వ పేజీలో...)

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి

8లో

వెంబడించి.. గంజాయిని పట్టుకుని!

- సుమారు 20 కిలోమీటర్ల మేర ఛేజ్
- పోలీసుల అదుపులో ఇద్దరు వ్యక్తులు.. కారు స్వాధీనం



కారు డిక్కీలో ఉన్న గంజాయి ప్యాకెట్లు

భామిని, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దు బత్తిలి చెకపోస్టు వద్ద శుక్రవారం ఒడిశా నుంచి వచ్చిన ఓ కారు ఆగకుండా దూసుకెళ్లింది. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సినీ స్టైల్‌లో ఛేజ్ చేశారు. గురండి, బిల్లుమడ, సింగిడి, భామిని సెంటర్‌లో పలువురు యువతకు ఫోన్‌లో సమాచారం అందించారు. కారును అడ్డుకోవాలని సూచించారు. మరోవైపు పోలీసులు సుమారు 20 కిలోమీటర్ల మేర ఆ కారును వెంబడించారు. భామినిలో యువత మరో అడుగేసి రోడ్డుకు అడ్డంగా యువత ట్రాక్టర్ పెట్టారు. అయితే ముందుకెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఆ కారు డ్రైవర్ వెనక్కి మళ్లించి బురుజోల గ్రామం వైపు వెళ్లాడు. అక్కడ నుంచి మార్గం లేకపోవడంతో కొత్తగూడ వద్ద కారు నిలిచిపోయింది. అదే సమయంలో అక్కడుకు చేరుకున్న హెచ్‌సీ శ్రీనివాస రావు, భామిని యువత కారులో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వాహనం డిక్కీని పరిశీలించగా.. గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. దీంతో నిందితులను బత్తిలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా.. దర్యాప్తు చేస్తున్నామని, ఉన్నతాధికారులు కేసు వివరాలు ప్రకటిస్తారని వెల్లడించారు.



కొత్తగూడ వద్ద పోలీసులు పట్టుకున్న కారు

విశాఖ సీఐఐ సదస్సులో ఎమ్మెల్యేలు 7లో

జగన్ హయాంలో ఎస్సీలకు మొండిచేయి
- ఏపీ మాదిగ వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి 6లో

కొండవెలగాడలో వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు 7లో

పంట పొలాల్లో ఏనుగుల సంచారం



ఇక్కడకు రావొద్దు

- గంజాయిభద్రలో వైద్యశిబిరాన్ని అడ్డుకున్న ఒడిశా అధికారులు
- వెనుదిరిగిన తోణాం పీహెచ్‌సీ సిబ్బంది

మక్కువ రూరల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దు.. వివాదాస్పద కొఠియా గ్రామమైన గంజాయిభద్రలో శుక్రవారం సాలూరు మండలం తోణాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఒడిశా అధికారులు అడ్డుకున్నారు. ఆంధ్రా అధికారులు ఇక్కడ విధులు నిర్వహించడానికి వీలు లేదన్నారు. వెంటనే వైద్యశిబిరాన్ని ఎత్తివేయాలని హుకుం జారీచేశారు. గంజాయిభద్ర, పట్టుచెన్నూరు సచివాలయాలు ఒడిశాలోని పొట్టంగి బ్లాక్ పరిధిలో ఉన్నాయ న్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ ఆంధ్రా అధికారులు విధులు నిర్వహించడం సరికాదని బీడీవో, ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు అన్నారు. అయితే అక్కడున్న గిరిజనులు మాత్రం తోణాం పీహెచ్‌సీ వైద్యశిబిరానికి మద్దతు తెలిపినట్లు తెలిసింది. సుమారు 20మంది వైద్యసేవలు పొందేందుకు ముందుకు రాగా ఒడిశా అధికారులు ససేమిరా అనడంతో గిరిజనులు ఇంటి బాట పట్టారు. మరోవైపు తోణాం పీహెచ్‌సీ వైద్యాధికారి అజయ్, తన వైద్య సిబ్బందితో కలిసి తిరుగు ప్రయాణమయ్యారు. కాగా ఆ సమయంలో గంజాయిభద్ర, పట్టుచెన్నూరు సర్పంచులు తోణాం వైద్య సిబ్బందికి ఎటువంటి సహకారమందించలేదు. ఏదేమైనా తరచూ కొఠియా గ్రామాల్లో ఒడిశా అధికారులు ఇలా వ్యవహరించడం పరిపాటిగా మారింది. దీనిపై ఇరు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



వైద్యశిబిరం ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నిస్తున్న ఒడిశా అధికారి



శిబిరం ఎత్తివేయాలని తోణాం వైద్య సిబ్బందిని ఆదేశిస్తున్న ఒడిశా పోలీసులు

రూ.వేలల్లో విద్యుత్ బిల్లులు
- ఆందోళనలో భూతలగూడ గిరిజనులు 8లో

అన్నా క్యాంటీన్‌లో ఆకస్మిక తనిఖీ 6లో

బాలలకు మానసికోల్లాసం అవసరం 6లో
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాలల దినోత్సవాలు

పోలీసుస్టేషన్‌కు దూరం.. పెద్దల మధ్యే పరిష్కారం
- ఏళ్ల తరబడి సంప్రదాయం కొనసాగిస్తున్న వైనం
- ఇదీ గంగిరెడ్ల కులస్థుల ప్రత్యేకత 6లో

బాలలే భవిష్యత్ వెలుగులు

- బాలల దినోత్సవంలో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



చిన్నారులతో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యం

బెలగాం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్ వెలుగులని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లలు రోజూ సంతోషంగా, ఉత్సాహంగా ఉంటేనే ఆనందంగా ఉంటుందన్నారు. శ్రద్ధతో ఏ పని చేసినా అద్భుతంగా ఉంటుందని చెప్పారు. ప్రతి పాఠశాలలో ఆఖరి గంట ఆటపాటలతో పిల్లలు గడిపేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి పరిశుభ్రమైన దస్తులు ధరించాలని, క్రమ శిక్షణతో ఉండాలనే ఉద్దేశంతో ముస్తాబు కార్య క్రమం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో ప్రతిభ కనబరిస్తే జిల్లాలో స్పోర్ట్స్ పాఠశాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అనంతరం పలు పాఠశాలల విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఏఎస్పీ మనీషారెడ్డి, ఐసీడీఎస్ పీడీ విజయగౌరి, డీఈవో రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పుతో మధుమేహం నియంత్రణ

డీఎంహెచ్‌వో భాస్కరరావు



రాయిందొరవలసలో మధుమేహంపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో

పార్వతీపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జీవనశైలిలో మార్పుతో మధుమేహన్ని నియం త్రించొచ్చని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు తెలిపారు. వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా పలువురికి షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధుల్లో మధుమేహం ప్రధాన సమస్యగా ఉందన్నారు. రక్తంలో షుగర్ లెవెల్స్ సాధారణ స్థాయి మించితే డయాబెటిస్ వస్తుందన్నారు. అధిక దాహం, ఆకలి, విపరీతమైన అలసట, తరచూ మత్ర విసర్జన, గాయం త్వరగా మానకపోవడం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. 'డయాబెటిస్ గుర్తించేందుకు వైద్య సిబ్బందితో ఎన్‌సీడీ సర్వే చేస్తున్నాం. దీనిలో భాగంగా వారు ఇంటింటికీ వెళ్లి 18 ఏళ్లు నిండిన వారికి షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.' అని జిల్లా ఎన్‌సీడీ అధికారి టి.జగన్మోహన్‌రావు తెలిపారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

గరుగుబిల్లి: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండొచ్చని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు తెలిపారు. శుక్రవారం రాయిందొరవలస, సన్యాసిరాజుపేట, పెదగుడబ గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. 'గృహాలకు ఆనుకుని మురుగు నీటి నిల్వలు, వ్యర్థాలు తొలగించాలి. ప్రజలు కలుషిత నీరు తాగకుండా చూడాలి. దోమల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి.' అని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మధుమేహం వల్ల కలిగే నష్టాలను వివరించారు. పీహెచ్‌సీల్లో ప్రత్యేక ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తామని, మందులను అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

పొగమంచు.. జాగ్రత్త

- 17 డిగ్రీలకు పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు
- మన్యం ఏజెన్సీలో మరింత తగ్గిన వైనం
- ఆస్తమా రోగులు, వృద్ధుల అవస్థలు
- అప్రమత్తత మేలంటున్న వైద్యులు


సాలూరు వేగావతి వంతెనపై మంచు దుప్పటి

రాజాం రూరల్/పాలకొండ/సాలూరు రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి)

గడచిన నాలుగు రోజులుగా చలితీవ్రత పెరిగింది. రాత్రి పది గంటల తరువాత తెల్లవార్లూ పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం ఏడు గంటల వరకూ ఇదే పరిస్థితి. దీంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రధానంగా ఆస్మా రోగులు, వృద్ధులు, చిన్నారుల వెతలు వర్ణనాతీతం. పొగమంచు ప్రభావం ప్రజలతో పాటు పంటలు, పశుపక్ష్యాదులపై కూడా తీవ్రంగానే పడుతోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల నుంచి 17 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. సీతంపేట, భామిని, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సాలూరు, పాచిపెంట తదితర మండలాల్లో 15 డిగ్రీలు ఉంటున్నాయి.

రోగుల వెతలు..

చిన్నారులు, వృద్ధులతో పాటు ఆస్తమా రోగులు ఓవైపు చలికి మరోవైపు పొగమంచు ప్రభావంతో అల్లాడిపోతున్నారు. పొగమంచుకు రోగాలబారిన పడుతున్నారు. ఉదయం సూర్యకిరణాలు దట్టంగా ప్రసరించే వరకూ ఆస్మా రోగులు బయటకు వెళ్లకూడదని, రాత్రివేళ త్వరగా ఇళ్లు చేరాలని వైద్యులు సూచిస్తున్నారు. చలికాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఫ్లూజ్వరం, ఆయాసం, సైనస్ఫ్లూ కేసులు పెరుగుతాయి. ఆస్తమా, పీవోపీడీ, అలర్జీ, న్యూమోనియా తదితర శ్వాశకోశ వ్యాధులు ముప్పు పొంచి ఉంది. శ్వాశకోశ వ్యాధులతో రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ త్వరగా దాడి చేస్తుందని వైద్యులు చెబుతున్నారు.

వాహన చోదకులూ బహుపరాక్..

పొగమంచు ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకునే ఆస్కారం ఉంది. ఎదురుగా వస్తున్న వాహనం కూడా కనిపించని విధంగా మంచు కురుస్తుండడంతో జాగ్రత్తగా ముందుకు సాగాల్సిన పరిస్థితి నెలకొంది. పొగమంచు కురిసేటప్పుడు మరీ అత్యవసరమైతే తప్ప వాహనాలతో బయటకు వెళ్లకూడదని అధికారులు చెబుతున్నారు. చిన్నచిన్న పట్టణాలకు పక్కన పెడితే జాతీయ రహదారిలో రోజంతా తిరిగాడే వాహనాల డ్రైవర్లు మాత్రం జాగ్రత్తగా ముందుకు వెళ్లాలిలంటున్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలే ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. రాత్రి పొద్దుపోయాక, మంచు దట్టంగా కురిసే సమయాలలో పెద్ద వాహనాలను నిలిపివేయాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ద్విచక్ర వాహనాలతో ప్రయాణించకూడదని చెబుతున్నారు. హైవేపై భారీ వాహనాలను పోలీసులు ఆపి డ్రైవర్, అదనపు డ్రైవర్ ముఖం కడుక్కుని ముందుకు సాగేలా చర్యలు ప్రారంభించారు.

- చల్లటి గాలులలకు శరీరం తెల్లగా పొడిబారినట్టు మారిపోతుంది. పెదవులు పగిలిపోయి ముఖం కాంతిహీనంగా మారుతుంది. అరికాళ్లు పగుళ్లు ఏర్పడతాయి. శరీరంతో తేమశాతం తగ్గడంతో చర్మ రక్షణ శక్తి తగ్గి దురదలు వస్తాయి. ఈ తరహా సమస్యలు దీర్ఘకాలిక రోగుల్లో మరింత ఎక్కువగా కనిపిస్తుంది. వాతావరణం మార్పుతో మరోవైపు ప్రజలు దగ్గు, ఆయాసం, గాలి పీల్చుకోవడం వంటి సమస్యలతో వారం నుంచి రెండు వారాల పాటు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. న్యూమోనియా, ఆస్తమా, సీవోపీడీ, గుండె వ్యాధులతో బాధపడే వారు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చల్లటి ప్రదేశంలో తిరిగినా, చల్లటి ఆహారం తీసుకున్నా సమస్య పెరుగుతుంది. ఆస్తమా, న్యూమోనియా బాధపడేవారు క్రమం తప్పకుండా మందులు వాడాలి.


సాలూరు వేగావతి నదిపై మంచు తెర


రాజాం-శ్రీకాకుళం రోడ్‌లో అంతకాపల్లి సమీపంలో..

వేడినీరు తాగాలి..

చెవి, ముక్కు, గొంతు సమస్యలున్నవారు చలికాలంలో జాగ్రత్తగా ఉండాలి. నీరు వేడిచేసి వడపోసుకొని తాగాలి. వెచ్చని దుస్తులు ధరించాలి. శరీరం పూర్తిగా కవర్ అయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి పానియాలు, ఐస్ క్రీమ్‌లు, తీసుకోవద్దు. గొంతునొప్పి ఉన్నవారు రోజూ రెండుసార్లు వేడిచేసిన నీటిలో కొంచెం ఉప్పు వేసి వాటిని పుక్కలించి ఉమ్మివేయాలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

తల్లడిల్లుతున్న ఆస్తమా రోగులు..

జిల్లా అంతటా ఆస్తమా రోగులు తల్లడిల్లిపోతున్నారు. నవంబరు మొదలు ఫిబ్రవరి మొదటి వారం వరకూ చలి, మంచుతో ఇబ్బందులు పడుతున్న ఆస్మారోగులు పొగమంచు పుణ్యమాని మరింత అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ ప్రభావంతో ఆయాసం ఎక్కువై, ఊపిరాడని పరిస్థితులు నెలకొంటున్నాయి. పాల ఉబ్బసతో బాధపడుతున్న చిన్నారులు సైతం తల్లడిల్లిపోతున్నారు.

ఆరోగ్యంపై దుష్ప్రభావం..



మంచు ప్రభావం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మంచులో ఎక్కువగా తిరిగితే శ్వాసకోశ, చర్మ సంబంధ వ్యాధులు వచ్చే పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. హృదయ స్పందనలో మార్పు రావచ్చు. గర్భిణులు, చిన్నపిల్లలు, మంచులోకి రాకూడదు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాలంటే తలకు, చెవులకు రక్షణ కలిగించే దుస్తులు వాడాలి. మంచులో నుంచి వచ్చిన వెంటనే వేడినీటితో స్నానం చేయడం మంచిది.

-డా. పి.ఎల్.ఎన్. రాజు, ఆస్మా వైద్యులు, రాజాం

గుండె జబ్బులకు ఆస్కారం..



యాభై ఏళ్లు పైబడిన వారు ఈసీజన్‌లో మద్యం సేవించకూడదు. దూమపానం చేయకూడదు. చలి మంటలకు దూరంగా ఉండాలి. వీటివలన శరీరం నుంచి నీరు ఎక్కువగా యూరిన్ ద్వారా బయటకు పోయి డీహైడ్రేషన్ సంభవిస్తుంది. గుండె జబ్బులకు గురయ్యే ప్రమాదం ఉంది. పొలం పనులకు వెళ్లాల్సి వస్తే కచ్చితంగా మాస్క్ వాడాలి. దుమ్ము, ధూళి సోక కుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో అర్హులైన వైద్యుడ్ని సంప్రదించాలి.

-డా. గార రవిప్రసాద్, ఎం.డి. జనరల్ మెడిసిన్

ప్రకృతి సాగు విస్తీర్ణం పెంచండి

- కలెక్టర్ రామసుందర్‌రెడ్డి


ఏటీఎం మోడల్‌లో కాయగూరల సాగును పరిశీలిస్తున్న రామసుందర్‌రెడ్డి

బొండపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణాన్ని జిల్లా వ్యాప్తంగా పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయాధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కొవ్వాడపేటలో ఏటీఎం మోడల్‌లో సాగుచేస్తున్న కాయగూరలు, ఆకు కూరలను రైతు ఎస్.రామకృష్ణ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. కొవ్వాడపేట మాదిరిగా జిల్లాలోని అన్ని గ్రామాలు కూడా మోడల్‌గా తీసుకొని సాగు చేసేలా అవగాహన కల్పించాలని కోరారు. రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడకం పట్ల రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వ్యవసాయశాఖ జేడీఏ వీటీ రామారావు, ప్రకృతి వ్యవసాయ డీపీఎం ఎం.ఆనందరావు, ఆర్‌టీఎల్ ప్రకాశ్, ఎన్ఎఫ్ఏ వరప్రసాద్, జేపీఈ మెర్సీ తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, ఏవో మల్లిఖార్జునరావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ హయాంలో ఎస్సీలకు మొండిచేయి

- ఏపీ మాదిగ వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి


పూల్‌భాగ్‌లో ఎస్సీ కార్పొరేషన్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఉండవల్లి శ్రీదేవి

విజయనగరం టౌన్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ పాలనలో ఎస్సీలకు మొండిచేయి చూపించారని ఏపీ మాదిగ వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి ఆరోపించారు. దోచుకో.. దాచుకో.. పంచుకో తప్పా ఎస్సీలకు ఎటువంటి ప్రయోజనం కలగలేదని చెప్పారు. శుక్ర వారం విజయనగరంలో డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ సైకోలా వ్యవహరించారని, ఎస్సీలపై చిన్నచూపు చూపుతూ వారి సంక్షేమానికి అడ్డుకట్ట వేశారని ఆరోపించారు. దళితుల కోసం ఏర్పాటు చేసిన బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, అంబేడ్కర్ విదేశీవిద్య, స్వయంఉపాధి కార్యక్రమాలపై జగన్ ప్రభుత్వం దృష్టి సారించలేదని విమర్శించారు. ఐదేళ్లలో నవరత్నాల్లో ఎస్సీలకు ఏ ఒక్క పథకం ఉపయోగపడలేదని తెలిపారు.గత ప్రభుత్వంలో దళితులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో అప్పటి సీఎం నారాచంద్రబాబునాయుడు 2014లో ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్ కింద రూ.7లక్షల కోట్లు బడ్జెట్‌లో 40వేల కోట్లు కేటాయించి ఎస్సీల అభివృద్ధికి పాటుపడ్డారని తెలిపారు. ఎన్ఎస్ ఎఫ్‌టీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌టీసీ పథకాలు 2014 నుండి 2019 వరకే అమలయ్యారన్నారు. మాది గల అభివృద్ధికి రూ.300కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం జిల్లాలో అమలువుతున్న వివిధ పథకాలపై ఆమె చర్చించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని శ్రీదేవి ఆదేశించారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన పూల్‌బాగ్‌లోని షాపులు, ఆర్టీసీయన్ కాంప్లెక్స్‌కు 1995లో వేణుగోపాలపురంలో కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీమాదిగ వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్లు డొక్కా నాగభూషణం, ఈతులపాక సుజాత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధాకుమారి పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌కు దూరం.. పెద్దల మధ్యే పరిష్కారం

- అవసరాల కోసం పెద్దల దగ్గర ఉన్న నగదు వినియోగం
- ఏళ్ల తరబడి సంప్రదాయం కొనసాగిస్తున్న వైనం
- ఇదీ గంగిరెడ్ల కులస్థుల ప్రత్యేకత


కొటారుబిల్లిలోని మామిడితోటలో సమావేశమైన గంగిరెడ్ల కులస్థులు

గంట్యాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాధారంగా ఎవరికైనా ఎదైనా సమస్య వచ్చినా, ఎటువంటి అల్లర్లు జరిగినా వెంటనే పోలీసులు, లేదా 100 ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తారు. అయితే గంగిరెద్దుల కులస్థులు మాత్రం వారిలో ఎవరికైనా సమస్య వస్తే పోలీసు స్టేషన్ గడప తొక్కరు. ఇది ఒకటి రెండు సంవత్సరాల నుంచి వచ్చిన ఆచారం కాదు. ఏళ్ల తరబడి నుంచి ఇదే సంప్రదాయం పాటిస్తున్నారు. ప్రతి ఆరు నెల లకు ఒక సారి కుల పెద్దలంతా ఒకే చోట కూర్చొని తమ సమస్యలను వారికి వారే చర్చించుకుని పరిష్కరించుకోవడం ఆ కులస్థుల ప్రత్యేకత. జిల్లాలో ప్రతి మండలంలోని నాలుగైదు గ్రామాల్లో చిరువ్యాపారాలు చేసుకుని గంగిరెడ్ల కులస్థులు జీవిస్తున్నారు. ద్విచక్ర వాహనాలపై గ్రామాల్లో తిరిగి ప్లాస్టిక్ వస్తువులు, వంట పాత్రలు, చిన్నపిల్లలు పూసలు, బెలూన్లు వంటివి విక్రయిస్తారు. దీని ద్వారా వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటారు. ఈ నేపథ్యంలో ఎస్.కోట, గంట్యాడ, బొండపల్లి తదితర మండలాల పరిధిలో వివిధ గ్రామాల్లో ఉన్న గంగిరెడ్ల కులస్థులు శుక్రవారం కొటారుబిల్లి కూడలిలో గల ఓ మామిడి తోటలో వారి కుల పెద్ద నలయ్య సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి ఇంటికి ఒకరు చొప్పున హాజరయ్యారు. ఇంట్లో మగవారు వేరే పని మీద ఎక్కడికైనా వెళ్తే ఆయా ఇళ్లలో ఉన్న ఆడవాళ్లైనా రావల్సిందే. ఇక్కడ వారికి ఉన్న సమస్యలపై చర్చించుకున్నారు. కాగా వీరంతా దాదాపు రూ 12 లక్షలు వరకూ నగదును కుల పెద్దలు వద్ద ఉంచుకున్నారు. ఎవరికి ఎదైనా అవసరం వస్తే వారు ఆ నగదును వాడుకుని తిరిగి పెద్దలకు చెల్లిస్తారు. వీరు చేపడుతున్న కార్యక్రమాలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

అన్నా క్యాంటీన్‌లో ఆకస్మిక తనిఖీ


భోజనం ఎలా ఉందని అడుగుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

బెలగాం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని అన్నా క్యాంటీన్‌ను శుక్రవారం కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న వారితో మాట్లాడారు. ఆహారం ఎలా ఉంది? సరిపోతుందా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎంతమంది వస్తున్నారని నిర్వాహకులను అడిగారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందిస్తున్నారని లబ్ధిదారులు అ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు.

బాలలకు మానసికోల్లాసం అవసరం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాలల దినోత్సవాలు

బాలలకు చదువుతోపాటు మానసికోల్లాసం అవసరమని వక్తలు తెలిపారు. శుక్రవారం జాతీయ బాలల దినోత్సవాన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఘనంగా నిర్వహించారు. చాచాజీ నేహ్రూ గొప్పతనాన్ని పిల్లలకు వివరించారు. పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన బాలలకు బహుమతులు ప్రదానంచేశారు.

- రాజాం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలికలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జూనియర్ న్యాయాధికారి నైమిష కేజీబీవీ ప్రిన్సిపాల్ సావిత్రిని ఆదేశించారు. గురవాం కస్తూర్బా బాలికల పాఠశాలలో వంటగది, స్టోర్‌రూం, మరుగుదొడ్లు, వసతి సౌకర్యాలను పరిశీలించారు. బాలికలకు అందిస్తున్న మెనూను పరిశీలించారు.
- ఎస్.కోట రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకోని ఉన్నత కొలువులు సాధించాలనీ ఎస్.కోట న్యాయస్థానం న్యాయాధికారి బి.కనకలక్ష్మి తెలిపారు. ధర్మవరం ఉన్నతపాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.
- గంట్యాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్ వెలుగులని ఐసీడీఎస్ పీడీ టి.విమలరాణి అన్నారు. మదనాపురం మోడల్ స్కూల్‌లో మాట్లాడుతూ చదువుతోపాటు బాలలు ఆట, పాటలు పనులు కూడా చేయాలన్నారు. డీసీపీయూ లక్ష్మి, ప్రిన్సిపాల్ రామకృష్ణరావు పాల్గొన్నారు.


నెల్లిమర్ల: గాంధీనగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బాలల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


కురుపాం రూరల్: నీలకంఠాపురం బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఇలా..


గుమ్మలక్ష్మీపురం: నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి


రేగిడి: లింగాలవలసలో ఆకట్టుకున్న విద్యార్థినుల ప్రదర్శన


రామభద్రపురం: ఆరికతోట శాఖా గ్రంథాలయంలో..


బొబ్బిలి శాఖా గ్రంథాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


బొబ్బిలి రూరల్ : కోమటిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..



వివిధ వేషధారణలో ఉన్న విద్యార్థులతో విజయనగరం ఎస్పీ దామోదర్

స్థలం ఇవ్వక.. పనులు సాగక

- ఆక్రమణదారునితో కొలిక్కిరాని చర్చలు
- ఇదీ కుమరాం పాఠశాల ప్రహరీ నిర్మాణం పరిస్థితి

జామి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమరాం పాఠశాల ఆవరణలో ప్రహరీ నిర్మాణంపై ఓ ఆక్రమణదారుడు స్థలం ఇచ్చేందుకు ఒప్పుకోకపోవడంతో పనులు ముందుకుసాగడం లేదు. ఆక్రమణదారుని చెరలో ఉన్న ఆ స్థలాన్ని సేకరించేందుకు అధికారులు మల్లగుల్లాలుపడుతున్నారు.ఈనేపథ్యంలో ఆయనతో జరుపుతున్న చర్చలు కొలిక్కిరావడం లేదు. కుమరాం ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 581 మంది చదువుతున్నారు. ఇక్కడ ప్రహరీకోసం ప్రభుత్వం రూ.36 లక్షలు కేటాయించింది. పాఠశాలను ఆనుకొని సర్వేనెంబర్ 84-1లో ప్రభుత్వ స్థలం ఓ వ్యక్తి ఆక్రమణలోఉంది. ప్రభుత్వ భూమిలో ప్రహరీ నిర్మాణం చర్యలు చేపట్టగా ఆక్రమణదారుడు తాను ఇచ్చేది లేదని మొండిపట్టు పట్టాడు. కనీసం పది అడుగులైనా ఇవ్వాలని గ్రామ పెద్దలు, అధికారులు కోరారు. ఈ నేపథ్యంలో తొలుత ఒప్పుకున్న తర్వాత మరోసారి ప్రహరీ నిర్మాణం ప్రారంభించే ముందు తాను ఇచ్చేది లేదని పట్టుపట్టడంతో మరోసారి కథ మొదటికి వచ్చింది. ఇష్టముంటే రెండున్నర అడుగుల్లో కట్టుకోవాలని సదరు ఆ క్రమణ దారుడు సూచిస్తున్నాడు. కాగా రెవెన్యూ బృందాన్ని పంపించి ప్రభుత్వ స్థలంలో సర్వేచేయించి పది అడుగుల హెచ్ఎంకు అప్పగించినట్లు తహసీల్దార్ కృష్ణంరాజు తెలిపారు.



కుమరాం పాఠశాల ఆవరణలోని స్థలంలో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

నేడు గాయత్రీ మహాయజ్ఞం

చీపురుపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఆర్య సమాజం 40వ వార్షికోత్సవాన్నిపురస్కరించుకొని శనివారం గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించనున్నట్టు సమాజం ప్రతినిధులు ఒకప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ధ్వజారోహణం, ఊరేగింపు, మహాయజ్ఞం జరుగుతాయని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

సంతకవిటి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఏవో సీబీ యశ్వంత్‌రావు తెలిపారు. మండలంలోని మందరాడ రైతు సేవా కేంద్రంలో 18 ఆర్ఎస్‌కేల వీఏఏలు, ఎఫ్‌టీవోలు, టీఏ, డీఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ధాన్యం ఎఫ్ఏక్యూ నామ్స్, గోనె సంచుల, ధాన్యం కొనుగోలు చేసే ప్రొక్యూర్, వాహనాలు రిజిస్ట్రేషన్, ట్రక్ షీట్లు, ఎఫ్‌టీవో జనరేషన్ గురించి చర్చించారు.

● రేగిడి, నవంబరు 14,(ఆంధ్రజ్యోతి): కొనుగోళ్లు ప్రారంభిస్తున్న నేపథ్యంలో ధాన్యంతరలిస్తున్న వాహనాలకు రిజిస్ట్రేషన్, జీపీఎస్ తప్పనసరి అని ఏవో శ్రీనివాసరావుసిబ్బందికి సూచించారు. చిన్నశిర్లాం రైతుసేవాకేంద్రంలో సిబ్బందితో ధాన్యం తరలించడంపై మాట్లాడారు. ధాన్యం తరలించే వాహనాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి, జీపీఎస్ సెట్‌చేసుకోకపోతే అనుమతించే దిలేదని తెలిపారు.

కుష్ఠువ్యాధిపై సర్వే చేయాలి

లక్కవరపుకోట (కొత్తవలస), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిపై ఈనెల 17 నుంచి 30 వరకు జరిగే అవగాహన కార్యక్రమంలో ప్రతి ఇంటా సర్వే చేయాలని కొత్తవలస పీహెచ్‌సీ డాక్టర్ సీతల్‌వర్మ కోరారు. శుక్రవారం కొత్తవలస పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో సన్యాసినాయుడు, సీహెచ్‌వో అప్పలకొండ పాల్గొన్నారు.

● రేగిడి, నవంబరు 14,(ఆంధ్రజ్యోతి): కుష్ఠురహిత సమాజం లక్ష్యం కావాలని, ఇది అందరి బాధ్యత అని బూరాడ పీహెచ్‌సీ వైద్యాధికారి రీనాచౌదరి, ఎంపీహెచ్‌వో రాధాకృష్ణ పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఈనెల 17 నుంచి 30వరకు కుష్ఠువ్యాధి నియంత్రణపై సర్వే నేపథ్యంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సావిత్రి, సూపర్‌వైజర్లు సాయికృష్ణ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు

దత్తిరాజేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హౌసింగ్ ఏఈ కె.రాజేష్ తెలిపారు. శుక్రవారం కోమటిపల్లిలో ఇళ్ల లబ్ధిదారుల సర్వే నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఇళ్లులేని లబ్ధిదారులకు ఆయా గ్రామాల సచివాలయ ఇంజనీరింగ్‌అసిస్టెంట్లను సంప్రదించి దరఖాస్తులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వసంత శ్రీను, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

బొండపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత శిక్షణ పొందిన వలంటీర్లపై ఉందని ఎంపీపీ చల్లా చలంనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉల్లాస్ కింద అక్షరాస్యులుగా మార్చే కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు శిక్షణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో కె.తులసీనాథ్, ఎంఈవో-2 ఎ.వెంకటరమణ, ఏపీవో ఎ.అరుణకుమారి, ఏపీఎం కె.పెంటంనాయుడు పాల్గొన్నారు.

● రేగిడి, నవంబరు 14,(ఆంధ్రజ్యోతి): ఉల్లాస్‌తో శతశాతం అక్షరాస్యత లక్ష్యం కావాలని ఎంఈవో వరప్రసాదరావు, మండల పరిషత్ ఏవో నాగమణి పేర్కొన్నారు. ఎంపీడీవోకార్యాలయంలో డ్వాక్రాగ్రూపులు, ఉపాధి సిబ్బందికిఉల్లాస్‌పై శిక్షణ నిర్వహించారు.

జీరోటిల్లేజీ పద్ధతితో ఖర్చు ఆదా

డెంకాడ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జీరోటిల్లేజీ పద్ధతిలో సాగుచేయడం వల్ల ఖర్చు ఆదా అవుతుందని జిల్లా వనరుల కేంద్రండీడీ భారతి, సహాయవ్యవసాయ సంచాలకులు ఎ.నాగభూషణరావు, ఏవో టి.సంగీత తెలిపారు. శుక్రవారం మండలంలోని చొల్లంగిపేటలో మొక్కజొన్న పంటలో జీరోటిల్లేజీవిధానంలో విత్తనాలువేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పినతాడివాడ సర్పంచ్ లక్ష్మణరావు, బి.రామకోటి, రాంబాబు, శాలిని పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

గజపతినగరం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయాధికారి ఎ. విజయ్ రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో న్యాయఅవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శీరవాసు, సాయిశేఖర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- జాతీయ వారోత్సవాలు ప్రారంభం
- ఆకట్టుకున్న వేషధారణలు

గ్రంథాలయాలు విజ్ఞానభాండాగారాలని వక్తలు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కేంద్రం గ్రంథాలయంతోపాటు శాఖా గ్రంథాలయాల్లో శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి.ఈసందర్భంగా విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రంథాలయ అధికారులు మాట్లాడుతూ ఈనెల 20 వరకు వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు,పాఠశాకులకు పోటీలు నిర్వహించి ఉత్సవాలు ముగింపు పురస్కరించుకుని బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.



శృంగవరపుకోట: స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలో బాలలు

విశాఖ సీఐఐ సదస్సులో ఎమ్మెల్యేలు



మంత్రి నాదెండ్ల మనోహర్‌తో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



సమ్మిట్ ప్రాంగణంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

శృంగవరపుకోట/ పార్వతీపురం, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని పార్వతీపురం, ఎస్.కోట ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, కోళ్ల లలితకుమారి విశాఖలో శుక్రవారం జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సదస్సుకు హాజరయ్యారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడులు రాబడుతున్నారని వారు కొనియాడారు ఉత్తరాంధ్ర అభివృద్ధికి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం: ఎమ్మెల్యే

లక్కవరపుకోట (కొత్తవలస), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశాలమేరకు గ్రీవెన్స్ నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నట్లు శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శుక్రవారం కొత్తవలస తహసీల్దార్‌కార్యాలయంలో లలితకుమారి గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా 250 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ ఛైర్మన్ పీవీ రత్నాజీ, టీడీపీ మండలాధ్యక్షుడు కోళ్ల శ్రీను, దుర్గా ఉమేష్, గొరపల్లి రాము, కొరుపోలు అప్పారావు, బీవీఎస్.రమేష్, లెంక శ్రీను పాల్గొన్నారు.

వినతులు పరిష్కరించేందుకు చర్యలు

భోగాపురం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): తమ దృష్టికి వచ్చిన వినతుల పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. శుక్రవారం పోలిపలిలో సీఎం ఆదేశాల మేరకు కార్యకర్తే అధినేత కార్యక్రమం నిర్వహించారు. అర్జీ దారులనుంచి భూసమస్యలు, ఎయిర్‌పోర్టు నిర్వాసితుల వినతులు, సీసీ రహదారులు, కాలువలు, తదితర వాటిపై వినతులు స్వీకరించారు. అన్ని సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు.



వినతిని స్వీకరిస్తున్న బంగార్రాజు

మహనీయుల త్యాగాలు మరువలేనివి

బొండపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దేశం కోసం మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివని డీఈవో యు.మాణిక్యంనాయుడు పేర్కొన్నారు. మండలంలోని దేవుపల్లి జడ్పీ హైస్కూల్‌లో దాతలు, స్కూల్ ఉపాధ్యాయులు సహాయంతో ఏర్పాటుచేసిన సర్వేపల్లి రాధాకృష్ణ, అబ్దుల్‌కలాం, అంబేడ్కర్, స్వామి వివేకానంద, గాంధీజీ విగ్రహాలను శుక్రవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి టి.సన్యాసిరాజు, ఎంఈవో-2 ఎ.వెంకటరమణ, స్కూల్ హెచ్ఎం కోట్ల ఎల్లంనాయుడు, నాయకులు రాపాక అచ్చింనాయుడు పాల్గొన్నారు.

కొండవెలగాడలో వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు

నెల్లిమర్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెలగాడలో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరగనున్న రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను శుక్రవారం టీడీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ ప్రారంభించారు. ఈ పోటీలకు రాష్ట్రంలో 26 జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. టీడీపీ నాయకుడు దంతులూరి అజయ్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు నీలంశెట్టి లక్ష్మి, కార్యదర్శి టి.దిన్నాబాబు, ఉడేటి వెంకటరామయ్య, టీడీపీ నాయకులు దంతులూరి అయజ్‌బాబు, మొయిద సత్యనారాయణ, తాడ్డి సత్యనారాయణ, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ప్రసవాలు పెంచాలి: డీఎంహెచ్‌వో

రాజాం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల్లో ప్రసవాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జీవనరాణి ఆదేశించారు. శుక్రవారం పొగిరి పీహెచ్‌సీతో పాటు లెప్రసీ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో ప్రసవాలు సంఖ్య తగ్గుతున్నాయని, ఇచ్చిన లక్ష్యలను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు.ఈవిషయంలో నిర్లక్ష్యం చేయకుండా సబ్‌సెంటర్లు సిబ్బందిని హెచ్చరించాలని సూచించారు. ఎన్‌సీడీ సర్వేను సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ఈనెల 17 నుచి లెప్రసీకి సంబంధించి ప్రత్యేక సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పొగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి గట్టి భార్గవి, లెప్రసీ వైద్యాధికారి జంపు రాజమోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీవనరాణి

సమస్యపై చర్యలు తీసుకోవడం లేదు

ఎస్.కోట రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు అంటే ప్రజల సమస్యలు పరిష్కరించేవారని, వారి సమస్యలు విస్మరించేవారు కాదని జిందాల్ నిర్వాసితులు తెలిపారు. అయితే తమ సమస్యపై ఏ ఒక్కరూ చర్యలు తీసుకోవడంలేదని వాపోయారు. శుక్రవారం మండలంలోని బొడ్డవర గ్రామంలో ఏపీ రైతుసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాసితులు మాట్లాడుతూ గడిచిన 153 రోజులుగా జిందాల్ యాజమాన్యం న్యాయం చేయాలని కోరుతుంటే ఏఒక్క నాయకుడు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీక్షలు ప్రారంభించే సమయంలో వచ్చిన ఎమ్మెల్యే నాలుగురోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారని గుర్తుచేశారు. ప్రస్తుత ఆ విషయం అడిగితే తమకు వేరే పని ఉందని చెబుతు కాలయాపన చేయడం తగదన్నారు.



నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

సిబ్బంది సకాలంలో హాజరుకావాలి

రాజాం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఇబ్బంది విధులకు సకాలంలో హాజరుకావాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఫిషరిస్ ఏడీ విజయ్ శ్రీనివాస్ కోరారు. గురువారం ఆంధ్రజ్యోతిలో సకాలంలో విధులకు వచ్చింది అరకొరే శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ ఎస్.రామచందర్‌రెడ్డి స్పందించి ప్రత్యేకాధికారిని తనిఖీ చేసి నివేదికలు అందజేయాలని శుక్రవారం ఆదేశించారు. దీంతో కంచరాం-1 2, ఒమ్మి సచివాలయాలను విజయ్ శ్రీనివాస్ తనిఖీ చేశారు.

మూమెంట్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించండి

చీపురుపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):సచివాలయ ఉద్యోగులు రికార్డుల్ని సక్రమంగా నిర్వహించాలని డీఎల్‌డీవో హేమసుందర్ సూచించారు. శుక్రవారం రావివలస సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. విధుల్లో భాగంగా సచివాలయాన్ని విడిచి బయటికివెళ్లిన ఉద్యోగులు తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లలపై శ్రద్ధ వహించాలి

డెంకాడ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రత్యేకావసరాల పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని జిల్లా ఉపవిద్యాశాఖఅధికారి కేవీ రమణ కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో భవితకేంద్రంలో జిల్లా సమగ్రశిక్షా, విద్యాశాఖ ఆధ్వర్యంలో విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లోగల ప్రత్యేకావసరాల పిల్లలకు ఉచిత ఉపకరణాలకు వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా విజయనగరం, నెల్లిమర్ల, పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ మండలాల నుంచి 160 మంది పాల్గొనగా వీరిలో 135 మంది వివిధ రకాల ఉపకరణాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఆర్.కృష్ణ, బి.పాపినాయుడు, ఎం.రమణమూర్తి, సహిత విద్య సహ కోఆర్డినేటర్ ఎం.భారతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణ

ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు కోరారు. ఈ మేరకు ఏపీమాదిగ వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవిని జడ్పీ అతిథిగృహంలో రాజు, బాబు, బాలయ్య, సత్యవతి, గణపతమ్మ, చిన్నారావు తదితరులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 29 పథకాలు రద్దుచేసి దళితుల ఆర్థికాభివృద్ధికి అన్యాయం చేసిందని విమర్శించారు. రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించాలని ఎస్సీల సంక్షేమానికి ప్రత్యేకంగా నిధులుకేటాయించాలని, నిర్వీర్యమవుతున్న ఎస్సీ కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలని, సమస్యలను పరిష్కరించి ఎస్సీల ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాలని కోరారు.

'ఉల్లాస్' వలంటీర్లకు శిక్షణ

గజపతినగరం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఇన్‌చార్జి ఎంపీడీవో పుష్పలత కోరారు. శుక్రవారం గజపతినగరంలో ఉల్లాస్ -అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకుశిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో విమలమ్మ, ఏపీఎం పి.నారాయణరావు, సీసీలు మూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదులో తప్పులను సరి చేసుకోవాలి

గజపతినగరం, నవబంరు14 (ఆంధ్రజ్యోతి): ఈ-పంట నమోదులో ఎటువంటి తప్పులు ఉన్నా ఈనెల 17లోగా అధికారులు సరిచేసి రైతులకు న్యాయం చేయాలని ఏఎంసీ ఛైర్మన్ పీవీవీ గోపాలరాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని పురిటిపెంట, ఎం.వెంకటాపురం గ్రామాల్లో ఈ-పంట నమోదుజాబితాను రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ నిర్మలజ్యోతి, ఏవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పంట పొలాల్లో ఏనుగుల సంచారం

కొమరాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మర్రిపాడు, చీడిపల్లి గ్రామాల్లోని పంట పొలాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. పత్తి, ఆయిల్‌పామ్, వరి పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే ఏనుగులను తరలించే ఏర్పాటు చేయాలని రైతులు కోరారు.

వేతన బకాయిలు చెల్లించాలి

గజపతినగరం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): పంచాయతీకార్మికులకు వేతన బకాయిలు చెల్లించకపోవడంతో శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె బాట పట్టారు. గజపతినగరం, పురిటిపెంట పంచాయతీలకు చెందిన పారిశుధ్య కార్మికులుబకాయిలను చెల్లించాలని సచివాలయాలు వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మి, బి.కనకరాజు, కోటేశ్వరరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాజాం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు.ఈమేరకు శుక్రవారం రాజాంమునిసిపల్ కమిషనర్ రామచంద్రరావును సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్, జిల్లా కార్యదర్శి ఎం.త్రినాథ్, కార్యదర్శి ఎన్.రవి, కమిటీ సభ్యులు పి.రాజేష్, లక్ష్మి, వి.చిన్నబాబు, పి. గిరిబాబు కలిశారు.



గజపతినగరం: నిరసన తెలియజేస్తున్న పంచాయతీ కార్మికులు

అగ్నిమాపకశాఖ ఉద్యోగి ఆత్మహత్య

ఎస్.కోట రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర గ్రామానికి చెందిన ఓ అగ్ని మాపకశాఖ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ నారాయణమూర్తి కథనం మేరకు..ఎస్.కోటఅగ్నిమాపకశాఖ కార్యాలయంలో వాహనం డ్రైవర్‌గా ముదునూరు అనీల్‌కుమార్ పనిచేస్తున్నాడు. ఇటీవల అనారోగ్యం బారినపడడంతో కుంగిపోయాడు.ఆరోగ్యం క్షీణిస్తుండడంతో విధులకు సెలవుపెట్టాడు.శుక్రవారం గ్రామసమీపంలోగల ఐతన్నపాలెం మట్టి రోడ్డు వద్ద అపస్మారక స్థితిలో ఉన్న అనీల్‌కుమార్ పక్కన ఒక పురుగుల మందు సీసాతో పడిఉన్న సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే ఎస్.కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం తరలిస్తుండగా మార్గమాధ్యలో మృతిచెందాడు. అనీల్‌కుమార్ భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పూసపాటిరేగ, నవంబరు14(ఆంధ్రజ్యోతి):మండలంలోని పేరాపురం జంక్షన్ వద్ద జాతీయరహదారి సర్వీస్ రోడ్డుపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందినతలాడ శివ(29) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. సర్వీసు రోడ్‌లో ద్విచక్రవాహనంపై శివ కోనాడ జంక్షన్‌వైపు వెళ్తున్నాడు.అదేదారిలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

లక్కవరపుకోట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో రేగ గ్రామానికి చెందిన ముగ్గురికి హత్యకేసులో జీవితఖైదు విధించినటు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. ఎస్పీకథనం మేరకు.. ఎల్.కోట మండలంలోని రేగ గ్రామానికి చెందిన గొల్ల ఈశ్వరరావు, గొల్ల విశ్వనాథం కుటుంబాలకు గతంలో భూతగాదాలు జరిగేవి. ఇందులోభాగంగా 2021జూలై 25న గొల్ల విశ్వనాథం కుటుంబ సభ్యులు గొల్ల అప్పారావు,గొల్ల దేముడమ్మ, గొల్లలక్ష్మి విశ్వనాథంతో కలిసి గొల్ల ఈశ్వరరావు కుటుంబంపై కొడవలి, కర్రలతో దాడిచేసి ఈశ్వరరావును చంపేశారు. ఈమేరకు మృతుడి కుమారుడు గొల్ల బాలాజీ ఎల్.కోట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేయడంతో అప్పటి ఎస్ఐ కె.లక్ష్మణరావు కేసు నమోదు చేశారు.దీనిపైఅప్పటి ఎస్.కోట సీఐ సింహాద్రినాయుడు దర్యాప్తుజరిపి హత్యకు కారకులైన నలుగురిపై అభియోగపత్రాలు కూర్టులో దాఖలు చేశారు. ఇందులో ఎ-1 గొల్ల అప్పారావు మృతిచెందగా మిగిలిన ముగ్గురికి జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.బబిత జీవితఖైదుతోపాటుఒక్కొక్కరికి రూ.మూడు వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు. ఈ కేసు పురోగతికి సహకరించిన హెచ్‌సీ రమేష్, సీఎంఎస్ ఎస్ఐ ఈశ్వరరావు, ప్రస్తుత సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ నవీన్‌పడాల్‌లను ఎస్పీ అభినందించారు.

పూరిల్లుపై దీపం ఒత్తి పడి..

- కోనూరులో నాలుగు ఇళ్లు దగ్ధం

గరివిడి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనూరులో శుక్రవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామస్థుల కథనం మేరకు..గ్రామంలోని ఓ ఇంటి వద్ద కార్తీకమాసం పురస్కరించుకుని తులసి మొక్క వద్ద దీపం వెలిగించారు. ఆ దీపం ఒత్తి కాకి తీసుకొచ్చి ఎదురుగా ఉన్న నంబూరి గోపి పూరింటిపై వేసింది. దీంతో గోపితో పాటు ఆయన ఇంటికి ఆనుకొని ఉన్న రెడ్డిసాయి, కొక్కెర మాలచ్చమ్మ, మహంతి లక్ష్మిల పూరిళ్లు కూడా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న చీపురుపల్లి అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు రూ.నాలుగు లక్షల వరకు ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

వింధ్యవాసిలో పశువుల శాల..

దత్తిరాజేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వింధ్యవాసిలో శుక్రవారం పశువులశాల దగ్ధమైంది.సర్పంచ్ రంభ చంద్రశేఖర్ కథనం మేరకు.. గ్రామ శివారున ఉన్న ఉరిటి తవిటినాయుడుకు చెందిన పశువుల శాలలో ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు హుటాహుటిన సంఘటలా స్థలానికి చేరుకున్నారు.అగ్నికీలల ఎగిసిపడడంతో శాలలో ఉన్న అప్పలనాయుడుకు చెందిన రెండు ఎద్దులు తీవ్రంగా గాయపడ్డాయి. అధికారులు వచ్చి నష్టాన్ని అంచనావేసి న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఏడు రోజుల జైలు

శృంగవరపుకోట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఎస్.కోట స్పెషల్‌జుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గండి అప్పలనాయుడు ఓ వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష ఖరారు చేశారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ కథనం మేరకు..వేపాడ మండలంలోని అతవకు చెందిన ఆతవ రామకృష్ణ మద్యం సేవించి ఈనెల 11న పుణ్యగిరి నుంచి వాహనంపై వస్తున్నాడు. స్థానిక దేవిబొమ్మ కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో ఎస్ఐ ఎల్.చంద్రశేఖర్ రామకృష్ణను ఆపారు. మద్యం సేవించినట్లు గుర్తించి, కేసునమోదు చేశారు. శుక్రవారం కోర్టులో హాజరుపరచడంతో శిక్ష విధించారు.

బైక్ అదుపుతప్పి భార్యాభర్తలకు గాయాలు

రేగిడి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినశిర్లాం సెంటర్ వద్ద శుక్రవారం రాత్రి మోటర్‌బైక్ అదుపుతప్పి లక్ష్మీపురానికి చెందిన భార్యాభర్తలు మీసాల సింహాచలం, మీసాల రమణమ్మలకు తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడం రాజాం ఆసుపత్రికి తరలించారు. 108 సిబ్బంది కథనం మేరకు.. లక్ష్మీపురానికి చెందిన భార్యాభర్తలు సింహాచలం, రమణమ్మ దంపతులు మోటర్‌బైక్‌పై మేనల్లుడు మృతిచెందడంతో నిద్దాం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో చిన్నశిర్లాం వద్ద బైక్ గంతలో దిగి అదుపు తప్పడంతో పడిపోయారు.దీంతోగాయపడినవారిని 108 సిబ్బంది ఈశ్వరరావు, జగన్నాథరావు ప్రథమచికిత్స నిర్వహించి రాజాంఆసుపత్రికి తరలించారు.

25 మంది బైండోవర్

రేగిడి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 25మందిని రేగిడి తహసీల్దార్ కృష్ణలత ఎదుట శుక్రవారం హాజరుపరిచి బైండోవర్ చేసినట్లు రాజాం ఎక్సైజ్ సీఐ భైబీమ్, ఎస్ఐ మహేష్‌లు తెలిపారు.వీరికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు పూచికత్తుతో ఏడాది కాలానికి బైండోవర్ చేసినట్లు చెప్పారు. బెల్ట్‌షాపులు, కల్తీమద్యం, సారా, డ్రగ్స్‌పై ప్రభుత్వం సీరియస్‌దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రాప్తికి ముందుస్తు చర్యలో భాగంగా బైండోవర్ కేసులు నమోదుచేస్తున్నట్లు సిఐ,ఎస్‌లు తెలిపారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

విజయనగరం రింగురోడ్డు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో(జీజీహెచ్) అరుదైన శస్త్రచికిత్స చేసి కణితిని విజయవంతంగా తొలగించారు. ఈఎన్‌టీ నిపుణుడు దక్షిణామూర్తి వైద్య సిబ్బందితో కలిసి చెవిలో కణితిని తొలగించారు. దక్షిణామూర్తి కథనంమేరకు.. విజయనగరానికి చెందిన జి.లక్ష్మి(59) మూడునెలలుగా చెవిలో నొప్పి, తల తిరడగం, వినికిడి లోపంతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల పదోతేదీన ఆసుపత్రిలోగల ఈఎన్‌టీ విభాగాన్ని సంప్రదించగా పరీక్షలు నిర్వహించి, గ్లోమస్ జుగులారే ట్యూమర్‌ను గుర్తించారు.ఈ మేరకు గురువారం లక్ష్మికి శస్త్రచికిత్స నిర్వహించి చెవిలోని కణితిని పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం ఆమెకోలుకుంది. అరుదైన శస్త్రచికిత్సను నిర్వహించిన వైద్య సిబ్బందిని సూపరింటెండెంట్ అను పద్మజ అభినందించారు.

ట్రిపుల్‌ఐటీ సీట్లు సాధించాలి

లక్కవరపుకోట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి ఎక్కువ ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి ఎస్.సత్యనారాయణ కోరారు. శుక్రవారం జమ్మాదేవిపేట వద్దగల మహాత్మా జ్యోతిభా పూలే బాలికల గురుకుల పాఠశాలలో తరగతి గదులు, డార్మెటరీ, మరుగుదొడ్లు, లాబ్, వంటగది పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు జ్యోతిశ్రీ, శ్రీదేవి పాల్గొన్నారు.

బిహార్‌లో ఎన్డీఏ విజయంపై సంబరాలు

విజయనగరం దాసన్నపేట, నవంబరు14(ఆంధ్రజ్యోతి): బిహార్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ విజయం సాధించడంతో శుక్రవారం విజయనగరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ,బీజేపీ నాయకులు పతివాడ రాజేష్, జిల్లా పదాధికారులు పాల్గొన్నారు.

● శృంగవరపుకోట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో జరిగిన ఎన్నికల్లో ఎన్‌డీఏ గెలుపొందడంతో ఎస్.కోటలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ మేరకు బీజేపీ మండలాధ్యక్షుడు మరస శ్రీను, నాయకుడు కోట్యాడ రామకోటి, దాశరధి హర్షం వ్యక్తంచేశారు.

రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలే!

(5వ పేజీ తరువాయి)

చేసే పరిస్థితి ఉండేది. ఉదాహరణకు ఒక బీటీ రహదారి నిర్మాణానికి రెండు కోట్లు అవసరమైతే.. ఆ మొత్తం ఉపాధి మెటీరియల్ కాంపోనెంట్‌లో మంజూరు చేసి ఆ పనులు పూర్తి చేసేవారు. ఈ మేరకు బిల్లులు చెల్లించే వారు. కానీ మారిన నిబంధనల ప్రకారం ఇకపై అలా కుదరదు. ఎంత పెద్ద రహదారి అయినా కేవలం రూ. 50 లక్షలు మంజూరు చేయనున్నారు. దీంతో అంతకుమించి నిధులు మంజూరు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఈ సమస్య గత కొన్ని నెలలుగా ఇంజనీరింగ్ శాఖ అధికారుల మధ్య నలుగుతోంది. ఈ విషయం బయటకు రానీయకుండా లోలోపల వారు మల్లగుల్లాలు పడుతున్నారు. కాంట్రాక్టర్లు బిల్లుల చెల్లింపుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతండడంతో తాజాగా అసలు విషయం బయటపడింది. మారిన నిబంధనల ప్రకారం ఒక రహదారి నిర్మాణానికి రూ.50 లక్షలు మాత్రమే చెల్లించనున్నారు. అంతకు మించి నిధులతో పనులు చేపడితే బిల్లులు చెల్లించే పరిస్థితి ఉండదు. దీంతో అటు అధికారులు, కాంట్రాక్టర్లకు ఏం చేయాలో తోచడం లేదు. అయితే ఇదే విషయంపై శుక్రవారం అమరావతిలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఆశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీనిపై ఢిల్లీకి వెళ్లి సమస్యను వివరించి బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు చెప్పినట్టు తెలిసింది.

త్వరలోనే బిల్లుల చెల్లింపులు

జిల్లాలో రహదారుల నిర్మాణాలకు సంబంధించి త్వరలోనే బిల్లుల చెల్లింపులు జరుగుతాయి. కొత్త నిబంధనల ప్రకారం కొన్ని బిల్లుల చెల్లింపులు నిలిచిన మాట వాస్తవమే. వాటి పనుల ప్రాప్తికి నిధులు జమవుతాయి.

- నగేష్‌బాబు, జిల్లా ఇంజనీరింగ్ అధికారి, పంచాయతీరాజ్ శాఖ

సొండికుల వనభోజనం రేపు

పాలకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ఆదివారం సొండికుల వనభోజనాలను నిర్వహిస్తున్నట్టు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రత్నాల కాశీవిశ్వనాధం అన్నారు శుక్రవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వనభోజనాలకు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరు కానున్నారన్నారు. గత ప్రభుత్వాలు సొండికుల సంక్షేమానికి ఆలోచించలేదన్నారు. కూటమి ప్రభుత్వం సొండి కులం సంక్షేమ కోసం పటుపడుతోందన్నారు. ఇందుకు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

అంగన్‌వాడీలను బలోపేతం చేయండి

పాలకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలను ప్రీస్కూల్ పిల్లలతో బలోపేతానికి చర్యలు తీసుకోవాలని వర్కర్ల జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.హిమప్రభ అన్నారు. శుక్రవారం బుక్కూరు సచివాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హిమప్రభ మాట్లాడుతూ మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండేలా జీవో జారీ ఇవ్వాలన్నారు. ప్రీస్కూల్ పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బుక్కూరు మహిళా సంఘం అధ్యక్షురాలు పద్మ, దివ్య, ఇందిర, గంగమ్మ, శిరీష, గౌరి, సంధ్యారాణి, జ్యోతి తదితరులున్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

పాలకొండ, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఫెడరేషన్ జిల్లా కోశాధికారి సీహెచ్.సంజీవి కోరారు. మహాసభల కరపత్రాలను శుక్రవారం పట్టణంలో ఆవిష్కరించారు. కార్య క్రమంలో కార్తీక్, పి.శ్రీను, శ్రీదేవి, విమల, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

పార్వతీపురం టౌన్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకాన్ని విజయవంతం చేస్తున్న బస్సు డ్రైవర్లు, కండక్టర్ల సమస్యలను పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రాములు కోరారు. శుక్రవారం స్థానిక డిపో గేటు ఎదుట సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గేటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని గంటలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో స్మార్టు కార్డులను పంపిణీ చేయాలన్నారు. డ్రైవర్లు, కండక్టర్లపై దాడులకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బస్సు స్టేషన్‌ల ప్రైవేటీ కరణ ఆపాలన్నారు. విద్యుత్ బస్సులను ఆర్టీసీ సంస్థ ద్వారా నడపాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి ఎ.ఎస్.టి.బాబు, సీఐటీయూ నాయకులు మన్మథరావు, బీవీరమణ, ఆర్.వేణు, పాల్గొన్నారు.

బీపీఎస్‌ను వినియోగించుకోవాలి

సాలూరు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనధికారిక నిర్మాణాలను బీపీఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ ద్వారా తమ డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని పట్టణవాసులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

బాలల హక్కులపై పోస్టర్ విడుదల


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాలకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంపటాపల్లి ప్రాథమిక పాఠశాల, పట్టణంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం బాలల హక్కులు వారోత్సవాలను నిర్వహించారు. జనచేతన సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాలల హక్కుల సంబంధించిన వాల్ పోస్టర్‌ను సంస్థ కార్యదర్శి బగాది శశిభూషణ చౌదరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తంపటాపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మల్లి, బాలికల పాఠశాల హెచ్‌ఎం నిర్మల, జనచేతన కో-ఆర్డినేటర్ మామిడి సరస్వతి, ఉపాధ్యాయులు వై.రమణమ్మ, కృష్ణవేణి, వి.చిన్నమ్మడు, సుమతి, పార్వతీశ్వరి, అనూరాధ పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు

కొమరాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్తాం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సంఘ సేవకుడు జల్లు నారాయణ దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామ్మోహనరావు, గోపాలం, జ్యోతి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కురుపాం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. శుక్రవారం స్థానిక రైతు సేవాకేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రాంభించారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లు ఎంపిక చేసుకుని ధాన్యం తరలించుకునే అవకాశం ఈ ఏడాది కల్పించామన్నారు. ధాన్యం పంపిన 24 గంటల్లో రైతు ఖాతాలోకి డబ్బులు జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్, ఏఎంసీ చైర్మన్ కడ్రక కళావతి, పీఏసీఎస్ అధ్యక్షుడు డొల్లు కిషోర్, టీడీపీ మండల కన్వీనర్ కె.వి.కొండయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు కోలా రంజిత్‌కుమార్, డొంకాడ రామకృష్ణ పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధికి కృషి

●కురుపాం: పాడి రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం సీతంపేటలో పశు వైద్యధికారి డాక్టర్ శైలజ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని శిబిరాన్ని ప్రారంబించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కడ్రక కళావతి, మాజీ ఏఎంసీ చైర్మన్ కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ కె.వి. కొండయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

నీలకంఠాపురాన్ని మండలం చేయండి

●గుమ్మలక్ష్మీపురం : నీలకంఠాపురం కేంద్రంగా ప్రత్యేక మండలాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరికి నీలకంఠాపురం ప్రాంత నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నీలకంఠాపురం పరిధిలోని 14 పంచాయతీలు కలుపుతూ ప్రత్యేక గిరిజన మండలం ఏర్పాటు చేయాలని వారు కోరారు. 30 ఏళ్లుగా ప్రత్యేక మండలంగా కావాలని కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ నీలకంఠాపురం కేంద్రంగా ప్రత్యేక మండలం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీడీపీ నాయకులు వెంపటాపు భారతి, ఏఎంసీ చైర్మన్ కడ్రక కళావతి, మాజీ ఎంపీపీ నీలకంఠేశ్వరరావు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ

గుమ్మలక్ష్మీపురం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): టిక్కబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట కళావతి, మాజీ ఎంపీపీ వెంపటాపు భారతి తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో బీజేపీ సంబరాలు


స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ శ్రేణులు

బెలగాం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): బీహార్‌లో ఎన్డీఏ కూటమి భారీ విజయం సాధించడంతో శుక్రవారం బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. పార్వతీపురంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో బాణసంచా కాల్చారు., స్వీట్లు పంచుకుని విజయోత్సవాన్ని జరుపుకున్నారు. మోదీ నాయకత్వానికి తిరుగులేదని బీహార్ ఎన్నికలు చాటాయని శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వి.పార్వతి, సొండి సంజీవ్, అల్లూరి పేర్రాజు పాల్గొన్నారు.

●గుమ్మలక్ష్మీపురం: బీహార్ నిర్వహించిన ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంపై మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఎల్విన్‌పేటలో కేక్‌కట్ చేసి బాణసంచా కాల్చారు.

7 వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కురుపాం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో సారా తయారీ కేంద్రాలపై దాడులు ఇరు రాష్ట్రాల ఎక్సైజ్ అధికారులు శుక్రవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. కేరడ, అనిజ, బోరువలస గ్రామాల్లో దాడులు నిర్వహించి 7 వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. 470 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు.

సంఘాల సేవలను వినియోగించుకోండి

కొమరాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయంలో శుక్రవారం అఖిల భారత సహకార వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ గులిపల్లి సుదర్శనరావు మాట్లాడుతూ వ్యవసాయ పరపతి సంఘాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ గంట మధుసూదనరావు, సీఈవో మాధవనాయుడు పాల్గొన్నారు.

డ్రోన్‌తో దోమల నివారణకు చర్యలు

మక్కువ రూరల్, నవబంరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం డ్రోన్ సహాయంతో దోమల నివారణ చర్యలు చేపట్టారు. మక్కువ డాక్టర్ శివాజీనాయుడు ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది మక్కువలో దోమలను నివారించేందుకు బ్యాసిలీస్ టోరేంజస్ మందును పిచికారీ చేయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భైరిసాగరంలో డోన్‌తో తొలిసారి దోమల నివారణ చర్యలు చేపట్టామని డా.శివాజీనాయుడు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది వెంకటరమణ, రవీంద్ర, డ్రోన్ ఫైలెట్ లోకేశ్, ఉప ఫైలెట్ జగదీశ్ ఉన్నారు.

పశువుల మృత్యువాతపై ఆందోళన

పార్వతీపురం టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సరైన వైద్యం అందక పశువులు మృత్యువాత పడుతున్నాయని కొత్తవలస పశువుల పెంపకం దారులు ఆవేదన వ్యక్తం చేశారు.శుక్రవారం కొత్తవలసకు చెందిన కోరాడ అన్నపూర్ణకు చెందిన చూడి ఆవుకు ఉదయం 8 గంటల సమయంలో కడుపు ఉబ్బరం వచ్చింది. వెంటనే వైద్యాధికారులకు తెలిపారన్నారు. పార్వతీపురం పశు వైద్యాధికారులు, సిబ్బంది చికిత్స చేసి వెళ్లిన తర్వాత సాయంత్రం 6 గంటల సమయలో ఆవు మృత్యువాత పడిం దన్నారు. పశువైద్యులు సకాలంలో వైద్యసేవలు అందించక పోవడంతోనే ఆదు మృత్యువాత పడిందని వారు ఆరోపించారు. ఇకనైనా పశువుల మరణాలను ఆపాలని లేకుంటే కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపడతామని కొత్తవలసకు చెందిన పశువుల పెంపకందారులు హెచ్చరించారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

గరుగుబిల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు బట్టు బాలకృష్ణయ్య మెమోరియల్ ట్రస్ట్ అండగా నిలుస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ డి.పారినాయుడు అన్నారు. శుక్రవారం తోటపల్లిలోని జ్ఞానజ్యోతి ఆధ్యాత్మిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ఆరుగురు విద్యార్థులకు రూ. 60 వేలను తోటపల్లి దేవస్థానం ఈవో బి.శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కోశాధికారి టి.గోపాలరావు, ఆలయ అభివృద్ధి ట్రస్ట్ ప్రతినిధులు టి.దుర్గారావు, ఎం.వాసుదేవరావు, ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులకు ప్రణాళికలు సిద్ధం

సీతానగరం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు చేపట్ట దానికి గ్రామసభల్లో ఆమోదం తెలిపాలని ఏపీవో బాలకృష్ణ కోరారు. శుక్ర వారం ఇప్పలవలసలో సర్పంచ్ లక్ష్మణరావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ప్రజల ఆమోదం మేరకు భవిష్యత్‌లో ఉపాధి హామీ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పనులపై అవగాహన కల్పించారు.


రోడ్డుకు మరమ్మతులు


రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

పార్వతీపురం టౌన్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి రాయగడ రోడ్డు శివారు వరకు ప్రధాన రహదారిలో శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. రహదారి వెంబడి గుంతలను పూడ్చారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డు యావత్తూ పాడైంది. రోడ్డు దుస్థితిని ఎమ్మెల్యే బి.విజయచంద్ర దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చించి గుంతల పూడ్చివేతకు చర్యలు చేపట్టారు.

శివుడి అవతారంలో అయ్యప్పస్వామి

సాలూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారిని శివయ్యగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామిని దర్శించుకునేందుకు అఅధిక సంఖ్యలో విచ్చేశారు.


లింగాకృతిలో అయ్యప్పస్వామి విగ్రహం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు మధుసూదనరావు, మాజీ సర్పంచ్ .శ్రీరాములు నాయుడు, శ్రీనివాసరావు ఉన్నారు.

●సాలూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమం లో ఎంఈవో అప్పల నాయుడు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు నిత్యం పుస్తకాలను చదవడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రాధాదేవి, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం శశికళ పాల్గొన్నారు.

●సీతంపేట రూరల్: సీతంపేట శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.గణేష్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఎంఈవో ఎం.ఆనందరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రంథాలయ సహాయకుడు రామకృష్ణ ఉన్నారు.

●కురుపాం: కురుపాం గ్రంథాలయంలో వుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమైయ్యాయి. గ్రంథ పాలకుడు అమ్మనబోలు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ కె.వి.కొండయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో రావాడ, రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. సుస్మిత పాల్గొన్నారు.

స్వయంశక్తి మహిళలకు అవగాహన

వీరఘట్టం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం స్వయంశక్తి సంఘాల మహిళలకు ఈ నారి శిక్షణ కా ర్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.లలితకుమారి మాట్లాడుతూ ఇకపై సభ్యుల పొదుపు, అప్పు వివరాలు మొబైల్‌లోనే తెలుసుకోవచ్చునన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు మిగిలిన సభ్యులకు తెలియజేయాలన్నారు

●భామిని: మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం స్వయంశక్తి మహిళలకు ఈ నారి శిక్షణ కార్యకమం నిర్వహించారు. మన డబ్బులు-మన లెక్కలు యాప్‌పై ఏపీఎం ఎం.చక్రపాణి అవగాహన కల్పించారు. శిక్షణలో సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

●జియ్యమ్మవలస: మహిళా సంఘాల బలోపేతంలో ఈ నారీలదే కీలక పాత్ర అని ఏపీఎం బి.శివన్నాయుడు అన్నారు. మండ మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా అధ్యక్షురాలు పల్లి రాజేశ్వరి అధ్యక్షతన మూడు రోజులుగా మన డబ్బులు - మన లెక్కలుపై నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీసీ నాగభూషణరావు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 25వినతులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతు ఇన్‌చార్జి పీవో

సీతంపేట రూరల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 25 వినతులు అందాయి. కొత్త పనుకువలస గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని రేవళ్ల యమున పీవోను కోరారు. ఆటో రుణం ఇప్పించాలని సవర నరేష్, బ్యాటరీ స్ప్రేయర్ ఇప్పించాలని దండాసి వినతిపత్రం అందజేశారు. దోనుబాయి రోడ్డు జంక్షన్ నుంచి బంబడుగూడ వరకు సీసీ రహదారి నిర్మించాలని సవర సుశీల, కుట్టు మిషన్ కోసం నిహారిక, గృహ నిర్మాణం కోసం గ్రామకంఠంలో స్థలం ఇవ్వాలని ఆడలీ గ్రామానికి చెందిన లవకుమార్ పీవోను కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీవో ఆర్‌వి గణేష్, టీడబ్ల్యూ ఈఈ పి.రమాదేవి, డిప్యూటీ ఈవో రామ్మోహనరావు, ఏపీడీ శ్రీహరి, డీఈ నాగభూషణ్ పాల్గొన్నారు.

గిరిజన చట్టాలను అమలు చేయండి

సీతంపేట రూరల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో గిరిజన చట్టాలను అమలు చేయాలని ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్‌ను ఆది వాసీ జేఏసీ, గిరిజన ఐక్యవేదిక, ఆదివాసీ సేన సభ్యులు బి.శ్రీనివాసరావు, బి.తేజేశ్వరరావు కోరారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజనేతరులు ఆక్రమించుకున్న భూమి, పెండింగ్‌లో ఉన్న ఎల్‌టీఆర్ కేసులను తక్షణమే పరిష్కరించాలని కోరారు. పీసా చట్టం పటిష్టంగా అమలు చేయాలన్నారు. సీతంపేటలో గిరిజన భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని విన్నవించారు. తురాయిపువలసలో సర్వే నెంబరు 4లోని పాత హైస్కూల్ పక్కన 1/70 చట్టానికి వ్యతిరేకంగా నిర్మాణం జరుగుతోందన్నారు. దాన్ని నిలుపుదల చేయించాలన్నారు. పీవోను కలిసిన వారిలో గిరిజన సంఘాల నాయకులు బి.ఉమామహేశ్వరరావు, రామ్మోహనరావు, సవర చొక్కారావు, సర్పంచ్‌లు ఆదిలక్ష్మి, వెంకునాయుడు తదితరులు ఉన్నారు.

వైద్యుల సర్దుబాటు


మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ నాగభూషణరావు

సీతంపేట రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చిన్నపిల్లల వైద్యుల కొరత, రోగులు పడుతున్న ఇబ్బందులపై శుక్రవారం 'వారు లేరు.. వీరు రారు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రచురితమైన కథనానికి డీసీహెచ్ఎస్ జి.నాగభూషణరావు స్పందించారు. శుక్రవారం ఆయన ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో చిన్నారుల ఓపీని పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏరియా ఆసుపత్రిలో ఇద్దరు చిన్నపిల్లల వైద్యులు మెడికల్ లీవ్‌లో ఉండడం మూలంగా ఇబ్బందులు తలెత్తాయన్నారు. ఇక్కడ చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యను దృష్టిలో ఉంచుకుని మెడికల్ లీవ్‌లో ఉన్న రెగ్యులర్ చిన్నపిల్లల వైద్యులు కోటేశ్వరరావు శుక్రవారం విధుల్లో చేరారన్నారు. అలాగే ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న చర్మ, నేత్ర, సివిల్ సర్జన్ వైద్యుల పోస్టులు కూడ భర్తీ అవుతాయని వివరించారు.

ఇద్దరికి కారుణ్య నియామక పత్రాలు


నియామక పత్రాలను అందజేస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

సాలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీలో ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న తుపాకుల మాతయ్య, తుపాకుల శివశంకర్ మృతి చెందిన నేపథ్యంలో వారి వారసులు తుపాకుల రామారావు, తుపాకుల ఇందుమతిలకు శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, మున్సిపల్ కమిషనర్ టిటి.రత్నకుమార్ కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, డీఈ బి.వి.ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ, టీపీవో ఝాన్సీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురం టౌన్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వీధుల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ దివ్య ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తవలస, గోపాలదాసుపేట ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం పట్టణంలోని ఇందిరాకాలనీ, గంటా వీధి, చిన్నమాదిగ వీధి, నిర్మలాకాలనీ, దేవాంగుల వీధి, బంధంవారి వీధి, టౌన్ పోలీస్‌స్టేషన్ రోడ్డు వీధి, బరాటం వీధి, కంగటి వీధి, నెయ్యిలవీధి, బోటు వీధులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే పాత బస్టాండ్, దంగిడి వీధి, అమ్మిగారి కోనేరు, ఎస్.ఎన్.ఎం.నగర్, దుర్గగుడి వీధి, తూర్పు వీధి, కాకర్ల వీధి, గడివీధి, కొత్తవీధి, రాయగడ రోడ్, వెంకటేశ్వర కాలనీ, గానీ వీధి, పరమేశ్వరీనగర్, జట్టు ఆశ్రమం నుంచి సూర్యపీఠం వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. కొత్తవలస ప్రధాన రహదారి మణికంఠ కాలనీ, సాయిరాం కాలనీ, నవిరి, గిజబ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆమె పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

రూ.వేలల్లో విద్యుత్ బిల్లులు

ఆందోళనలో భూతలగూడ గిరిజనులు


విద్యుత్ బిల్లులను చూపుతున్న భూతలగూడ గిరిజనులు

సీతంపేట రూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): 'మేము వాడేది మూడు బల్బులు, ఒక ఫ్యాన్ మాత్రమే. విద్యుత్ బిల్లులు మాత్రం రూ.వేలల్లో వస్తున్నాయి.' అని గిరిపుత్రులు వాపోయారు. తమ సమస్య పరిష్కరించాలని శుక్రవారం వారు ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్‌కు వినతిపత్రం అందించారు. కొత్తూరు మండలం గొట్టిపల్లి పంచాయతీ పరిధి భూతలగూడకు చెందిన సవర సొంబూరుకు రూ.7100, చిన్నకు రూ.9290, రమేష్‌కు రూ.2594, దుర్గారావుకు రూ.2600, కద్రయ్యకు రూ.3153 వరకు విద్యుత్ బిల్లులు వచ్చాయి. చిన్నరాజపురం గ్రామానికి చెందిన సన్నాయికి రూ.15,000 కరెంటు బిల్లు వచ్చింది.' అని వారు తెలిపారు. ఇదేంటని సంబంధిత అధికారులను అడిగితే.. విద్యుత్ బిల్లు ఎంత వస్తే అంత కట్టాల్సిందేనని చెబుతున్నారని గ్రామస్థులు తెలిపారు. తమను ఆదుకోవాలని వారు కోరారు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయ ధర్మదాయ శాఖ - శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు శ్రీ కోదండరామ స్వామి వారి దేవస్థానములు, తోటపల్లి గ్రామం, గరుగుబిల్లి మండలం, పార్వతీపురం మన్యం జిల్లా

టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన

ఆర్.సి.నెం. 14/2025 తేది: 14.11.2025

పార్వతీపురం మన్యం జిల్లా, గరుగుబిల్లి మండలం, తోటపల్లి గ్రామములో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానములకు చెందిన దిగువ తెలిపిన 1 నుండి 3 ఐటంల హక్కులకు తే 26.11.2025 ది బుధవారం ఉదయం గం.11.00ని.ల నుండి దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు, గ్రామస్తులు సమక్షములో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వారిచే టెండర్ కం బహిరంగ వేలం పాటలు నిర్వహించబడును. కావున ఆసక్తి గల వారు సదరు వేలం పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

వ నెం	హక్కు వివరములు	కాలపరిమితి	చెల్లించవలసిన ధరావత్తు	వేలం తేదీ మరియు సమయం
1	శ్రీ స్వామి వారికి భక్తులచే సమర్పించి వదలి వేయబడిన తలనీలాలు 1 సంవత్సరము కాలం స్వయముగ ప్రోగు చేసుకొని పోవుట గూర్చి	పాట అప్పగించిన తేది నుండి ఒక సంవత్సర కాలము	రూ.50,000/-లు	తే 26.11.2025 ది బుధవారం ఉదయం గం.11.00ని.ల నుండి
2	శ్రీ స్వామి వారికి భక్తులచే సమర్పించి వదలి వేయబడిన తలనీలాలు మరియు దేవస్థానముచే ప్రోగు చేయబడిన తలనీలాలు అన్ని సైజులు కలుపుకొని సుమారు 44 కేజీలు	-	రూ.50,000/-లు	తే 26.11.2025 ది బుధవారం ఉదయం గం.11.00ని.ల నుండి
3	శ్రీస్వామి వారికి భక్తులచే సమర్పించి వదలి వేయబడిన కొబ్బరి కాయలలో సగభాగం	పాట అప్పగించిన తేది నుండి రెండు సంవత్సరముల కాలము	రూ.10,000/-లు	తే 26.11.2025 ది బుధవారం ఉదయం గం.11.00ని.ల నుండి

పాటలో పాల్గొను వారు పైన తెలిపిన విధముగా ప్రథమ ధరావత్తును ఏదైనా జాతీయ బ్యాంక్‌లో ఈ దేవస్థానం పేరున డిమాండ్ డ్రాఫ్టును (డి.డి) తీసి సమర్పించవలెను. దేవస్థానం ప్రయోజనములకు అనుగుణమునగా టెండర్ - కం - బహిరంగ వేలము సమయమున షరతులు, నిభంధనలు మార్పులు చేయు అధికారం దేవదాయ శాఖ అధికారులకు కలదు. టెండర్ - కం - బహిరంగ వేలం పాట షరతులు కార్యాలయం పనిచేయు వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును. సంప్రదించు ఫోన్‌నెం. 9701270410

సం/- బి.శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి